శిక్షణ ఉచితం.. ఉపాధిపై నమ్మకం

- 'పీఎం కేవీవై'లో వివిధ కోర్సుల్లో శిక్షణ
- పెదమైనవానిలంక, రుస్తుంబాద గ్రామాల్లో కేంద్రాలు
- ఇప్పటి వరకు 100 మందికి శిక్షణ
- మరో బ్యాచ్ శిక్షణ ప్రారంభానికి సిద్ధం




లేసుపార్కులో కంప్యూటర్ శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతీ యువకులు

నరసాపురం రూరల్: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎం కేవీవై) పథకం ద్వారా ఇస్తున్న ఉచిత స్వల్పకాలిక నైపుణ్య శిక్షణతో నిరుద్యోగ యువతీ యుకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై నమ్మకం ఏర్పడింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దత్తత గ్రామమైన నరసాపురం మండలం పెదమైన వానిలంక గ్రామంలోని డిజిటల్ భవనంలో పీఎం కేవీవై ద్వారా వెబ్ టెక్నాలజీ, స్పోకెన్ ఇంగ్లిష్, స్కిల్ డెవలప్‌మెంట్, ఎలక్ట్రీషియన్, ల్యాబ్ టెక్నీషియన్ తదితర కోర్సుల్లో స్వల్పకాలిక శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను అందిస్తున్నారు. అలాగే, రుస్తుంబాద గ్రామంలోని అలంకృతి లేసు పార్కులోనూ యువతకు కంప్యూటర్ వెబ్ టెక్నాలజీపై శిక్షణ ఇస్తున్నారు. ఈ రెండు సెంటర్లలో ఇప్పటి వరకు మూడు బ్యాచ్‌ల ద్వారా 100 మందికి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను అందించారు. మరో బ్యాచ్ ప్రారంభానికి సిద్ధంగా ఉందని, ఆసక్తి ఉన్నవారు ఈ శిక్షణా కేంద్రాల్లో నేరుగా సంప్రదించి, దరఖాస్తు చేసుకోవచ్చునని ట్రైనీ పి.నర్సింహరాజు తెలిపారు.

పనిచేసుకుంటూ శిక్షణ



నేను డిగ్రీ పూర్తి చేసి టీవీ రిపేర్‌లు చేసి ఉపాధి పొందుతున్నాను. వెబ్ టెక్నాలజీపై మూడు నెలల శిక్షణ పొందుతున్నాను. శిక్షణ పూర్తి కావచ్చింది. శిక్షణ ద్వారా నాకు ఒక నమ్మకం ఏర్పడింది. ఏదైనా జాబ్ కోసం దరఖాస్తు చేసుకుంటాను.

– కాటం సామ్యూల్ సుందర్, నరసాపురం

బీ ఫార్మసీ పూర్తి చేశా



మాది సీతారామపురం సొంత్ గ్రామం. నేను బీ ఫార్మసీ పూర్తి శాను. ఇప్పుడు కంప్యూటర్ జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సు మూడు నెలలుగా నేర్చుకుంటున్నాను. శిక్షణ పూర్తయిన అనంతరం ఏదైనా జాబ్‌కు దరఖాస్తు చేసుకుంటాను.

– జిల్లి లక్ష్మీ ప్రసన్న, సీతారామపురం

మూడు నెలలుగా శిక్షణ



మాది నరసాపురం. పీఎం కేవీవై పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఇస్తున్న శిక్షణలో జాయిన్ అయ్యాను. దాదాపు శిక్షణ పూర్తి కావచ్చింది. త్వరలో ఏదైనా జాబ్ చేసి మా కుటుంబానికి ఆర్థికంగా ఆసరాగా ఉండాలనుకుంటున్నాను.

– వరసా జయసాయి, నరసాపురం

కోర్సుపై పట్టు



నేను బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశాను. జాబ్ కోసం జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌లో మూడు నెలల కోర్సు పూర్తి చేశారు. శిక్షణ బాగా జరిగింది. ఎన్నో విషయాలను నేర్చుకున్నాను. ఈ శిక్షణ నా లాంటి నిరుద్యోగులకు ఎంతగానో దోహదపడుతుంది.

– తణుకుల విజయేంద్రబాబు, కొప్పర్రు

శిక్షణ బాగుంది



నేను మూడు నెలలుగా ఇక్కడ శిక్షణకు హాజరవుతున్నాను. బాగా చెబుతున్నారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోర్సు పూర్తికావచ్చింది. ధైర్యంగా కంప్యూటర్‌పై వర్క్ చేయగలుగుతున్నాను. సర్టిఫికెట్ చేతికి వచ్చిన తర్వాత ఉద్యోగంలో జాయిన్ అవుతాను.

– పోలిశెట్టి హేమ, కొప్పర్రు

క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సహకరించాలని ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ కోరారు. యాళ్ల వానిగరువులో తన కార్యాలయంలో సోమవారం ఏపీఎస్‌ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ డైరీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాంతీయ కార్యదర్శి నీతిపూడి వెంకట్రావు, నరసాపురం డివిజన్ అధ్యక్షుడు బి.నరేంద్ర శ్రీనివాస్, కార్యదర్శి కె.సురేష్, వై.నారాయణరావు, చొప్పల కనకరత్నం, కె.నాని తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఉత్సవాలు ప్రారంభం



కొండాలమ్మకు పూజ చేస్తున్న భక్తులు

పెనుగొండ: దొంగరావిపాలెం టోకు కూరగాయల మార్కెట్ వద్ద కొండాలమ్మ ఆలయ 20వ వార్షికోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభించారు. అమ్మవారికి అర్చకుడు పూజ్యం సత్యనారాయణ బ్రహ్మత్వంలో కుడిపూడి నరసింహమూర్తి, విజయదుర్గ దంపతులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈనెల 7వ ఆఖరు రోజు అన్నసమారాధన ఉంటుందని శ్రీ వెంకటేశ్వర కూరగాయల వర్తక సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎనమదల సాయిబాబు, సంఘం సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

వాసవీ మాత సేవలో కలెక్టరు నాగరాణి



నగరేశ్వర స్వామి, అమ్మవార్లను దర్శించుకొంటున్న కలెక్టరు నాగరాణి

పెనుగొండ: స్థానిక వాసవీమాతను కలెక్టరు చదలవాడ నాగరాణి దర్శించుకొన్నారు. సోమవారం తొలుత మూలవిరాట్ వాసవీ మాత కొలువై ఉన్న శ్రీనగరేశ్వర మహిషాసుర మర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో శ్రీనగరేశ్వర స్వామిని, మహిషాసురమర్ధనీ, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం వాసవీ శాంతి థాంలో మరకతశిల వాసవీ మాతను దర్శించుకొని, నగరేశ్వర స్వామిని దర్శించుకొన్నారు.

పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శోభారాణి

పాలకొల్లు అర్బన్: డీఎన్నార్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడేందుకు జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. కళాశాలలో సోమవారం ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థినులకు ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో కరాటే శిక్షకుడు డి.ప్రకాష్ కరాటేలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, ఫిజికల్ డైరెక్టర్ రమేష్, రమణ, సంధ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు



కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 61వ వార్షికోత్సవ మహోత్సవంలో సోమవారం సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనలు శ్రీతాండవ నృత్య నికేతన్ భీమవరం వారిచే ప్రదర్శించబడిన కూచిపూడి జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం అమ్మవారి ఉత్సవ కమిటీ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



నరసాపురంలోని విశ్వమైత్రి పిరమిడ్

నరసాపురం రూరల్: ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని విశ్రాంత ఉపాధ్యాయురాలు కె.స్వర్ణలత అన్నారు. నరసాపురం పట్టణం మాధవాయిపాలెంలో ఆమె ఎనిమిదేళ్ల క్రితం విశ్వమైత్రి పిరమిడ్ నిర్మించారు. ఈ కేంద్రాన్ని బ్రహ్మశ్రీ సుభాష్ పత్రీజీ ప్రారంభించారు. ఇక్కడ ఇప్పటి వరకు సుమారు 10వేల మందికి ధ్యాన శిక్షణ ఇచ్చామని, శాఖాహారం తినడం వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తూ సుమారు 50కి పైగా ర్యాలీలు నిర్వహించామమని స్వర్ణలత తెలిపారు. ఇక్కడి పిరమిడ్ ఒక శక్తివంతమైనదని పత్రీజీ, మూడు పర్యాయాలు ఈ కేంద్రాన్ని సందర్శించిన సదానందయోగి సైతం అభివర్ణించారని చెప్పారు. ఈ కేంద్రం ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుని మంగళవారం తొమ్మిదో సంవత్సరంలోకి అడుగు పెడుతున్నట్టు స్వర్ణలత వివరించారు.

ఫీజుపోరును విజయవంతం చేయాలి

తూర్పుపాలెంలో పోస్టర్ విడుదల చేసిన నాయకులు



ఫీజుపోరు పోస్టర్ విడుదల చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

పోడూరు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మార్చి 12వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ఫీజుపోరు ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసు) పిలుపునిచ్చారు. తూర్పుపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులు ఫీజుపోరు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ గత 3 త్రైమాసికాలకు సంబంధించిన విద్యార్థుల ఫీజులను కూటమి ప్రభుత్వం ఇవ్వకపోవడం దారుణమన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో రూ.14 లక్షల కోట్లు అప్పులు చేశారని తప్పుడు లెక్కలు చెబుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పథకాలు అమలుచేయకుండా కుంటిసాకులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో చేసిన అప్పులు రూ.7 లక్షల కోట్లని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిన విషయాన్ని పెద్దిరాజు, వాసురెడ్డి గుర్తు చేశారు. విద్యార్థులకు కూటమి ప్రభుత్వం సుమారుగా రూ.1800 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. కల్లబొల్లి కబుర్లు చెబుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిరీర్యం చేస్తూ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్చి 12న జరిగే ఫీజుపోరు ఆందోళనలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు నాయకత్వంలో ఆచంట నియోజకవర్గంలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పెద్దిరాజు, వాసురెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రి రామలింగేశ్వరరెడ్డి, అధికార ప్రతినిధి గుబ్బల వీరబ్రహ్మం, కార్పొరేషన్‌ల మాజీ డైరెక్టర్లు కొవ్వూరి వేణుమాధవరెడ్డి, పోతుమూడి రామచంద్రరావు, మండల కన్వీనర్లు పిల్లి నాగన్న, గూడూరి దేవేంద్రుడు, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, దంపనబోయిన బాబూరావు, దొంగ దుర్గాప్రసాద్, బుర్రా రవికుమార్, పులిదిండి వెంకటేశ్వర్లు, కోట వెంకటేశ్వర్లు, పలివెల శ్రీను, కాసాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ ప్రక్షాళన కోరుతూ ఆందోళన



రుస్తుంబాదలో ఆందోళన చేస్తున్న రైతులు

నరసాపురం రూరల్: సత్వరమే మురుగునీటి కాలువను ప్రక్షాళన చేయాలని నరసాపురం మండలం రుస్తుంబాద రైతులు డిమాండ్ చేశారు. వైఎస్ పాలెం గ్రామ మాజీ సర్పంచ్ కూనపరెడ్డి రంగారావు నేతృత్వంలో సోమవారం వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా రుస్తుంబాద మురుగు డ్రెయిన్‌ను తవ్వక పోవడం, ఆక్రమణలకు గురై డ్రెయిన్‌కు ఆనుకుని ఉన్న సుమారు 400 ఎకరాలకు చెందిన రైతులు వరి సాగుకు దూరమయ్యారని తెలిపారు. నరసాపురం పట్టణం నుంచి మొగల్తూరు వరకు వెళ్లే ఈ కాలువలోకి పట్టణానికి చెందిన మురుగును మళ్లించడంతో ఈ డ్రెయిన్ మరింత ప్రమాదకరంగా తయారైందని చెప్పారు. కొన్నేళ్లుగా సార్వా, దాళ్వా సాగు చేయడంలేదన్నారు. సమస్యను ఈ ప్రాంతానికి పాదయాత్రగా వచ్చిన లోకేష్ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మాజీ సర్పంచ్ కూనపరెడ్డి రంగారావు, యడ్లపల్లి బాలాజీ, యడ్లపల్లి అర్జునుడు, మల్లికార్జునరావు, బెల్లపుకొండ పద్మారావు, మైలాబత్తుల శ్రీను, వర్ధనపు సుధాకర్, యర్రంశెట్టి నరసింహరావు, యర్రంశెట్టి పాండు రంగ తదితరులు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్‌లో పనిచేయడం మంచి అనుభూతి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

నరసాపురం: విద్యార్థి దశలో ఎన్ఎస్ఎస్‌లో పనిచేయడం ద్వారా మంచి అనుభూతి మిగులుతుందని నన్నయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు అన్నారు. వైఎన్ కళాశాలలో జాతీయసేవా పథకం (ఎన్ఎస్ఎస్), మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆరు రోజుల జాతీయ సమైక్యతా శిబిరాన్ని సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థుల్లో సేవా దృక్పథం ఎన్ఎస్ఎస్ ద్వారా అలవటుతుందన్నారు. 12 రాష్ట్రాల వలంటీర్లు ఈ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ చదువుతో పాటుగా విద్యార్థులకు సామాజిక సేవ కూడా అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, పోలిశెట్టి రఘురామ్, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎస్ యాకోబ్, చింతా సోమేశ్వరి, కళాశాల డీన్ గంధం రామకృష్ణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనారోగ్యం



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న సీఐ నాగరాజు

భీమవరం: ప్లాస్టిక్ వినియోగించడం వలన క్యాన్సర్ వ్యాధి ప్రబలుతుందని అందువల్ల ప్లాస్టిక్ నిషేధాన్ని బాధ్యతగా తీసకోవాలని భీమవరం వన్ టౌన్ సీఐ ఎం.నాగరాజు అన్నారు. సోమవారం భీమవరం మున్సిపాలిటీ, శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విచ్చల విడిగా ప్లాస్టిక్ వాడడం వలన వాతావరణం కలుషితమై కొన్ని రకాల వ్యాధులకు కారణమవుతుందని ప్లాస్టిక్ వలన ఏర్పడే అనర్థాలను ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఎస్సై బీవై కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మనుషులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం కూడా ఆరోగ్యకరంగా ఉంటుందని ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టి ఆరోగ్యకరమైన సమాజాన్ని సృష్టించాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు స్టీల్ గ్లాసులు, ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు వేంద్ర వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, భీమవరం బార్ అసోసియేషన్ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఆనంద్, జి.సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.


18 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



విద్యార్థులకు నియామక ఉత్తర్వులు అందిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: స్థానిక బీవీఆర్ అండ్ జీకే ఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం శ్రీరామ్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. మొత్తం 24 మందిలో 18 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికచేశారు. వీరిలో నలుగురు చాంబర్స్ కళాశాలకు చెందిన వారని కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహరావు తెలిపారు. కంపెనీ హెచ్ఆర్ అల్లూరి సునీత, ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీ సీతారామరాజు, ప్లేస్‌మెంట్ అధికారులు జానకిరామయ్య, టి.మీనా పాల్గొన్నారు.

గోవులను రక్షించాలని వినతి



వినతిపత్రం స్వీకరిస్తున్న హైందవ శంఖారావం సభ ప్రతినిధులు

ఆకివీడు: రోడ్లపై తిరుగుతున్న ఆవులను, ఆబోతులను రక్షించేందుకు ద్వారకా తిరుమల దేవస్థానం సహకరించాలని ఆకివీడు నగర పంచాయతీ కమిషనర్ కె.కృష్ణమోహన్ వినతి పత్రం పంపారు. ఈ మేరకు హైందవ శంఖారావం ఆకివీడు శాఖ ప్రతినిధులకు వినతి పత్రాన్ని సోమవారం కమిషనర్ అందజేశారు. ఈ వినతి పత్రాన్ని ద్వారకా తిరుమల ఈఓకు అందజేస్తామని శంఖారావం సభ గౌరవ ధ్యక్షుడు భమిడిపాటి సూర్యభాస్కరరావు అధ్యక్షుడు లంకా జలదుర్గా ప్రసాద్ చెప్పారు. గత కొన్నేళ్లుగా ఆవులను, ఆబోతులను రోడ్లపైకి వదిలి వేస్తున్నారని చెప్పారు. వీటి వలన వాహన చోదకులకు, ప్రయాణికులకు, ద్విచక్ర వాహనదారులకు ఇబ్బంది కల్గడమే కాకుండా ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. వాటి రక్షణ నిమిత్తం ద్వారకా తిరుమల గోశాలకు దేవస్థానం సొంత ఖర్చులతో తరలించే విధంగా సహకరించాలని కమిషనర్ వినతి పత్రం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాక్షుడు యర్రా రఘు, కార్యదర్శి నెల్లి సతీష్, అమన్నమంచి నారాయణ, చొప్పెర్ల శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం



రావిపాడులో మొక్కలు నాటుతున్న దృశ్యం

పోడూరు: పర్యావరణ పరిరక్షణపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని గోదా వరి పర్యావరణ పరిరక్షణ సమితి (జీపీపీఎస్) కార్యదర్శి తానేటి శేఖర్ పిలుపునిచ్చారు. రావిపాడు గ్రామంలో జీపీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నూతన దంపతులైన కందికట్ల సందీప్, లీలా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్యదర్శి శేఖర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, వాతావరణంలో కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా జీపీపీఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ కార్యదర్శి దేవ రాజేష్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందన్నారు. జీపీపీఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం, ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దేవ సుశీల, గోగులమండ జ్యోతి, దేవ కళ్యాణి, బొంతు నరసింహరాజు, జీపీపీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన ఇలవేల్పు సంబరం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 61 వార్షిక మహోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి నిత్యం విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలు ఈనెల 13న ప్రారంభం కాగా వచ్చే నెల 14వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

మద్యం షాపుల అర్జీలకు నేటితో గడువు పూర్తి

నరసాపురం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మూడు మద్యం షాపులను గీతకులాలకు కేటాయించినట్టు ఎక్సైజ్ సీఐ ఎస్ రాంబాబు తెలిపారు. నరసాపురం పట్టణంలో ఒకటి, రూరల్ మండలంలో ఒకటి, మొగల్తూరు మండలంలో ఒకటి కేటాయించారని చెప్పారు. ఈనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

మున్సిపల్ హైస్కూల్‌లో తనిఖీ



వంటశాలను పరిశీలిస్తున్న కమిషనర్ అంజయ్య

నరసాపురం: స్థానిక 12వ వార్డు మున్సిపల్ స్కూల్‌ను సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యాబోధన తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల వద్ద పారిశుద్ధ్య ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. హెచ్ఎం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



జుత్తిగలో నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

పెనుమంట్ర: అయోధ్యలో దళిత యువతిపై అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కుల వివక్ష పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. జుత్తిగ గ్రామంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ 76 ఏళ్ల స్వాతంత్రం తరువాత కూడా దళిత మహిళలకు రక్షణ కల్పించలేని ప్రభుత్వా లు ఎందుకు అని ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షులు కండెల్లి కృష్ణ, కంకిపాటి నరేష్, సత్తిబాబు, కొడమంచిలి నాని తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఔదార్యం



విద్యార్థిని తల్లిదండ్రులకు నగదు అందిస్తున్న భవానీ ప్రసాద్

పాలకొల్లు అర్బన్: స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న కుశల్ ఈశ్వర్ ఇటీవల భోగి మంటల్లో పడి 80 శాతానికిపైగా కాలిపోయి భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆ పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానిప్రసాద్ స్పందించి తన మిత్రుల సహకారంతో రూ.1.49 లక్షల నగదును విద్యార్థి తల్లిదండ్రులకు అందజేశారు.

వర్మీ కంపోస్టు మోడల్ గ్రామంగా చింతపర్రు

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రు గ్రామాన్ని వర్మీ కంపోస్టు మోడల్ తయారీ కేంద్రంగా ఎంపిక చేసినట్టు ఈవోపీఆర్‌డీ తాళ్ల మూర్తిబాబు చెప్పారు. సోమవారం ఆయన చింతపర్రు గ్రామాన్ని సందర్శించారు. ఇక్కడ వర్మి కంపోస్టు యూనిట్‌కి అవసరమైన నీరు, విద్యుత్ సౌకర్యం, షెడ్లు పక్కాగా ఉన్నాయన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గిస్తామన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులను చింతపర్రు వర్మి కంపోస్టు కేంద్రానికి రప్పించి అవగాహన కలిగించడంతో పాటు ప్రతి గ్రామంలోనూ వర్మి కంపోస్టు తయారు చేసుకుని ఆదాయ వనరులు పెంపునకు కృషి చేస్తామని వివరించారు. పంచాయతీ కార్యదర్శి శివరామాంజనేయులు తదితరులు ఆయన వెంట ఉన్నారు.